

వ్యాక్సిన్ పరిణామాలపై విచారణకు కమిటీ: సీఎం

బెంగళూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల యువత హృద్రోగాలతో మృత్యువాత పడడానికి కోవిడ్ వ్యాక్సిన్ ప్రభావమే కారణమని సీనియర్ పాత్రికేయుడు రాజారాం తల్లూరు వినతిపై సీఎం సిద్దరామయ్య స్పందించారు. అందుకు సంబంధించి తగిన విచారణ జరిపిస్తామని, నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తామని సీఎం ఎక్స్ ద్వారా పేర్కొన్నారు. మృతి చెందిన వారి వివరాలను సేకరించడంతోపాటు సమగ్ర పరిశోధనలు జరిపేలా వైద్య నిపుణులు, శాస్త్రవేత్తలతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు.







హోం X డీసీఎం

- రెండో ఎయిర్‌పోర్ట్ కోసం పోటాపోటీ
- తుమకూరుకు తీసుకెళ్లే ఆలోచనలో హోంమంత్రి పరమేశ్వర్
- మాగడివైపు సర్వే చేయించిన డీకే

తుమకూరుకే పరమేశ్వర్ మొగ్గు

21 జిల్లాలకు అనుబంధమైన చోటునే విమానాశ్రయం ఏర్పాటు చేయాలని ఇది తుమకూరు ప్రాంతంలో సముచితమని హోం మంత్రి పరమేశ్వర్ స్పష్టం చేశారు. బెంగళూరు వీడితే తుమకూరు, చిత్రదుర్గ నుంచి ఉత్తర కర్ణాటక జిల్లాల అన్నింటికీ జాతీయ రహదారికి అనుబంధంగా ఉండే తుమకూరు ప్రాంతంలో విమానాశ్రయం మంచిదన్నారు. అయితే విమానాశ్రయం తన నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు కావాలనే ఆశ ఉందని డీసీఎం డీకే శివకుమార్ ప్రస్తావన తెచ్చారు. నెలమంగల - సోలూరుల పరిధిలో విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన భూమి ఉందన్నారు. ఫ్లైయింగ్ జోన్‌కు కనీసం 4,400 ఎకరాల భూమి అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

బెంగళూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలంలో బెంగళూరుకు అనుబంధంగా దేవనహళ్లిలోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం విశ్వవ్యాప్తంగా పేరొందింది. కొవిడ్ తర్వాత గణనీయంగా ప్రయాణీకుల సంఖ్య పెరిగింది. దీనికి తోడు సరుకు రవాణాలోనూ విశేష ప్రగతి సాధించింది. రానున్న పదేళ్లలో విమానాశ్రయానికి అన్ని విధాలా ఒత్తిడి పెరగనుందని బెంగళూరుకు అనుబంధంగా మరో చోట్ల అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికితోడు ప్రస్తుతం విమానాశ్రయానికి ఉండే ఒప్పందం పదేళ్లలో ముగియనుంది. ఈలోగా రెండో విమానాశ్రయం ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ మహత్తరమైన ఆలోచనగా ఉంది. రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ ఐదు నెలలక్రిందట చేసిన ప్రస్తావన అంచెలంచెలుగా పాకి భూమి సర్వేలదాకా వెళ్లింది. అయితే రెండో విమానాశ్రయం ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశం ఇద్దరు కీలకనేతలమధ్య పోటీకి కారణమవుతోంది. బెంగళూరుకు అనుబంధంగా ఎయిర్‌పోర్ట్ ఉంటే మినహా అభివృద్ధి సాధ్యం కాదని అన్ని వర్గాలు ఒక నిర్ణయానికి వచ్చాయి. రెండో విమానాశ్రయం బెంగళూరులో కాకుండా వెనుకబడిన కల్యాణ కర్ణాటక జిల్లాల్లో ఏర్పాటు చేయడం సముచితమని అభిప్రాయాలు వచ్చాయి. అయితే బెంగళూరులో ఉన్నంత అనుకూలం, ఐటీ, బీటీ, రక్షణారంగం, వైమానిక రంగం, అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన విద్యాసంస్థలు వందలకొలదీ ఎంఎన్‌సీ కంపెనీలు ఉన్నందునే ఉన్న విమానాశ్రయానికి రద్దీ ఉందని తేల్చేశారు. దీన్నిబట్టి బెంగళూరుకు అనుబంధంగానే విమానాశ్రయం ఏర్పాటు చేయాలనేది స్పష్టమైంది.

భూముల ధరలకు రెక్కలు

డీసీఎం, హోం మంత్రులు తమ నియోజకవర్గాల పరిధిలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు డిమాండ్ చేస్తున్న తరుణంలోనే ఒక్కసారిగా ఆ ప్రాంతంలోని భూముల ధరలకు రెక్కలొచ్చాయి. రియల్ ఎస్టేట్ ఏజెంట్‌లు గద్దల్లా వాలిపోయారు. ఎయిర్‌పోర్ట్ ఎక్కడ ఏర్పాటు అవుతుందో తెలియదుగానీ రెండు నియోజకవర్గాల పరిధిలో రియల్ ఎస్టేట్ జోరుగా సాగుతోంది. రెండు నెలలుగా సర్వేలు, మంత్రుల అభిప్రాయాలు మలుపులు తిరిగినట్లుగానే రియల్ వ్యాపారాలు కూడా తిరుగుతున్నాయి. బెంగళూరులో రెండో ఎయిర్‌పోర్ట్ విషయమై కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహననాయుడు సానుకూలంగా స్పందించారు. ఇటీవలే లోక్‌సభలో మంత్రి మాట్లాడుతూ బెంగళూరు పరిధిలో భూమి సిద్ధం చేస్తే విమానాశ్రయం ఏర్పాటుకు తాము అనుకూలమని ప్రకటించారు. దీంతో ఆశలు మరింత పెరిగాయి. కానీ మాగడి, నెలమంగల ప్రాంతాల్లో ఇటీవల భూముల సర్వేకు అధికారులు వెళ్లినప్పుడు స్థానికులు అడ్డుకున్నారు. దీంతో డ్రోన్‌ల ద్వారా సర్వేలు చేశారు.

హోసూరులో ఏర్పాటుకు తమిళనాడు యత్నాలు

కాగా బెంగళూరు నగరానికి సరిహద్దులో తమిళనాడు రాష్ట్రం హోసూరులో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగాయి. బెంగళూరు నుంచి మెట్రో సేవలు హోసూరు దాకా విస్తరింపచేసి విమానాశ్రయం ఏర్పాటు చేయించాలని తమిళనాడు భావించింది. రెండు రాష్ట్రాలమధ్య మెట్రో సేవలు అనుసంధానం చేసినట్లు అవుతుందని ప్రతిపాదనలు పెట్టారు. బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ (బీఎంఆర్‌సీఎల్), చెన్నై మెట్రో రైల్ కార్పొరేషన్‌లు మధ్య చర్చలు కూడా జరిగాయి కానీ ఫలించలేదు. తాజాగా విమానాశ్రయం ఏర్పాటు విషయమై తమిళనాడుకు చెందిన ఎంపీలు, కేంద్ర విమానయానశాఖ మంత్రితో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. అయితే హోసూరులో విమానాశ్రయానికి పలు అభ్యంతరాలను లేవనెత్తినట్లు తెలుస్తోంది. ఇది తమిళనాడుకు షాక్ ఇచ్చేలా మారినట్టు తెలుస్తోంది. అదే నిర్ణయం కొనసాగితే బెంగళూరులో రెండో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు మరింత సుగమం చేసినట్లు అవుతుంది. అయితే తమిళనాడు ప్రభుత్వం అంతటితో నిరుత్సాహం చెందకుండా ప్రయత్నాలను కొనసాగిస్తోంది. రెండు స్థలాలను ఎంపిక చేసి వాటి వివరాలను కేంద్ర ప్రభుత్వానికి, విమానయానశాఖ మంత్రిత్వశాఖకు పంపించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

నేనూ రేసులో..!

- కోలారు జిల్లాలో మంత్రి పదవి నాకే ఇవ్వాలి
- మీడియాతో ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణ స్వామి

బంగారపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ నెలలో మంత్రివర్గం పునఃవ్యవస్థీకరణ అయ్యే అవకాశం ఉందని తాను కూడా మంత్రి పదవి ఆశిస్తున్నవారిలో ఉన్నానని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తెలిపారు. పట్టణంలోని తాలూకా కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒకవేళ తనకు మంత్రి పదవి దక్కకపోతే నిరాశ చెందనన్నారు. శ్రీనివాస గౌడ తర్వాత కోలారు జిల్లా నుంచి ఎవరూ మంత్రి కాలేదన్నారు. అభివృద్ధి విషయంలో జిల్లా వెనుకబడి ఉందని జిల్లా సమగ్ర అభివృద్ధికోసం పదవి ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. ప్రతిపక్షాలు ముడా వివాదాన్ని సీబీఐ దర్యాప్తుకు డిమాండ్ చేస్తున్నాయని అంతటి అవసరం లేదన్నారు. ఒకవేళ సీఎం సిద్దరామయ్య ఆస్తి సంపాదించాలనే లక్ష్యం కలిగి ఉంటే ఎంతో సంపాదించి ఉండేవారని, భార్య పేరిట ఆస్తులు పొందాల్సిన అవసరం లేదన్నారు. సత్యానికి జయం లభిస్తుందన్నారు. గ్యారెంటీలతో పేదల బతుకుల్లో వెలుగులు నింపడమే సిద్దరామయ్య ధ్యేయమన్నారు. రాజకీయ దురుద్దేశాలకోసం ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. బీజేపీ ఆరోపణలు ఎవ్వరూ నమ్మనరన్నారు. ఈ సందర్భంగా నగరాభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు గోపాలరెడ్డి, సమాజసేవకుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

దేవెగౌడవన్నీ ప్రగల్భాలే..!

- మేకెదాటుకు అనుమతులు తెస్తానన్నారు.. మాట తప్పారు..
- ప్రచారం కాదు.. నిబద్ధతతో మాట్లాడండి: డీసీఎం డీకే

బెంగళూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మేకెదాటు ప్రాజెక్టు విషయంలో ప్రధాని నరేంద్రమోదీ చేత సంతకం పెట్టిస్తానని ప్రగల్భాలు పలికిన జేడీఎస్ నేత, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ ఇంతవరకు ఎందు సాధించలేకపోయారని, కేవలం ప్రచారం కోసం కాకుండా రాజకీయ నిబద్ధతతో మాట్లాడాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మండిపడ్డారు. ఆయన గౌరవాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు. శుక్రవారం కనకపుర తాలూకాలోని శివనహళ్లి హోబళి మల్లాపుర తాలూకాలో బసవేశ్వరస్వామి ఆలయాన్ని ప్రారంభించిన అనంతరం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడారు. తాము మేకెదాటు పాదయాత్ర చేపట్టినప్పుడు ఆయన విమర్శించారన్నారు. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీతో జేడీఎస్ పొత్తు కుదిరిందని అయినా ఎందుకు అనుమతి సాధించలేదని ప్రశ్నించారు. కాగా బెంగళూరు చరిత్రలో తనదంటూ ఒక అధ్యాయాన్ని సృష్టించానన్నారు. తాను డీసీఎం అయ్యాక అన్ని ప్రాంతాల్లో నీరు అందేలా చర్యలు చేపట్టానన్నారు. తొరెకాడనహళ్లి, ఎత్తినహొళెలనుంచి నీరు తెప్పించామన్నారు. త్వరలోనే తుమకూరు వరకు కూడా నీరు అందిస్తామన్నారు. గతంలోని బీజేపీ-జేడీఎస్ సాధించలేని పనులు తమ ప్రభుత్వం సాధించి తీరుతామన్నారు. గతంలో పాదయాత్ర చేపట్టినప్పుడు ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నామని, ప్రాజెక్టు అమలు చేసేందుకు కట్టుబడ్డామన్నారు.

కుమారస్వామికి బాధ్యత లేదా..?

రాష్ట్రానికి గ్రాంట్లు సాధించడానికి సంబంధించి తనతో ఏ మంత్రి కూడా చర్చించలేదన్న అంశంపై స్పందిస్తూ మీతో తాను ఎందుకు చర్చించాలని, మీకు బాధ్యత లేదా అని కుమారస్వామిని సూటిగా ప్రశ్నించారు. తాను రాష్ట్రానికి చెందిన అందరు మంత్రులతో కలసి ప్రధానమంత్రి నరేంద్రమోదీని భేటీ అయ్యామన్నారు. పలుపురు కేంద్రమంత్రులతోనూ చర్చలు జరిపామన్నారు. మీకు వ్యక్తిగత లాభం కోసమే తప్ప రాష్ట్ర, దేశ ప్రయోజనాలు పట్టవని దేవెగౌడను ఉద్దేశించి మండిపడ్డారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేవేళ దేవెగౌడ గురువారం మాట్లాడుతూ లోక్‌సభలో బీజేపీకి 245 స్థానాలు దక్కడాన్ని కాంగ్రెస్ విమర్శిస్తోందని, కర్ణాటక శాసనసభలో 136 స్థానాలు పొందిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏం ప్రయోజనమని అక్కడ అవినీతి రాజ్యమేలుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన గ్రాంట్లలోనూ అవినీతి జరిగిందని, కర్ణాటక ప్రభుత్వం అత్యంత అవినీతిలో కూరుకుపోయిందన్నారు. అందుకు బీజేపీ సభ్యులు కాంగ్రెస్ పట్ల షేమ్ షేమ్ అన్నారు. ఆదివాసీ మహిళకు రాష్ట్రపతి పదవికి ఎంపిక చేయడం అభినందనీయమని ప్రధాని మోదీ కొనియాడారు. ఇదే సందర్భంగా బెంగళూరుకు శాశ్వతంగా తాగునీరు కావాలంటే ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమన్నారు. డీకే ఘాటుగా స్పందించారు



బసవేశ్వరస్వామి ఆలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

గ్యారెంటీల నడుమ బడ్జెట్ తయారీ...

గత శాసనసభ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలకు అనుగుణంగా ఐదు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఏడాదికి 56వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతోందన్నారు. పేద ప్రజల ముఖాలలో వెలుగులు నింపడమే లక్ష్యమన్నారు. మరో రెండు రోజుల్లో బడ్జెట్ తయారీ ప్రక్రియ పూర్తి కానుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేవలం చిప్ప పెట్టారని మండిపడ్డారు. దేవెగౌడ, కుమారస్వామి, ప్రహ్లాద్‌జోషిలు పార్లమెంటులో ప్రజల సమస్యలను ప్రస్తావించడం లేదని ఆరోపించారు. వారికి తమను విమర్శించడమే వారికి సంతోషం కలిగిస్తుందన్నారు. అలాగే వారి సంతోషమే మా సంతోషం అంటూ వ్యంగ్యం చేశారు.

వివాదాలకు వారధి..!

- రాజకీయాలకు వేదికగా బళ్లారి కనక దుర్గమ్మ అండర్‌పాస్
- పనులు పూర్తయినా ప్రారంభించరు..
- బీజేపీ నిరసనలు పట్టించుకోని ప్రభుత్వం
- పలుమార్లు వాయిదా.. రేపటి ముహూర్తమైనా కుదిరేనా..?

బళ్లారి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నగరంలో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన కనకదుర్గమ్మ వారధి రాజకీయాలకు అడ్డాగా మారింది. పనులు పూర్తయినా ప్రారంభించడం లేదని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు ఎప్పుడు ప్రజలు తిరిగేందుకు తెరుస్తారు.? చేసేందుకు ఇంకా ఏ పని పెండింగ్ ఉంది? ఈ పని చేసేందుకు ఇంతగా టైం కావాలా.? బళ్లారి నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బళ్లారి నగర మధ్యలో ఉండే ఈ దారి వెంట రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. పైగా ఈ రోడ్డు నగరంలో ఉండే రోడ్లలో ప్రధానమైనది కూడలి. ఈ రైల్వే అండర్ బ్రిడ్జి గతంలో శిథిలంగా ఉండేది. వర్షాకాలం వస్తే నడుం లోతు నీరు చేరి వాహనదారులకు ఇబ్బందిగా ఉండేది. అండర్ పాస్ నీటిలో పడి వాహనదారులు పలుమార్లు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో మరమ్మత్తులకు ప్రభుత్వం ముందుకొచ్చింది. నిర్మిత కేంద్ర నిధులతో పనులు చేపట్టింది. నిర్మిత కేంద్రకు ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్ ఉంటారు. ఆయన పర్యవేక్షణలోనే ఈ పనులు సాగుతాయి. రూ.కోటి పైన నిధులతో చేస్తున్న ఈ పనులు ఆలస్యం కావడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా ఇది స్లాబ్ వర్క్ కాదు అర్ధ వర్క్. ఎందుకు లేట్ అవుతుందో ఎవరూ చెప్పడం లేదు. గతంలో తుంగభద్ర డ్యాం క్రస్ట్ గేట్లు సైతం కేవలం మూడు నాలుగు రోజుల్లో మరమ్మత్తు పనులు చేసిన సంఘటనలు ఉన్నాయి. మరి కొద్ది పాటి అండర్ బ్రిడ్జి పనులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయో అని ప్రజలు వాపోతున్నారు. పైగా కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించే సమయంలో అగ్రిమెంట్ సమయం ఉంటుంది. ఆ అగ్రిమెంట్ కాలంలోగా పనులు చేయకుంటే కలెక్టర్ దాన్ని రద్దు చేసి వేరే కాంట్రాక్టర్‌తో నైనా పనులు చేయించ వచ్చు. కానీ అలాంటి చర్య లేవీ తీసుకోలేదని ప్రజలు మండిపడుతున్నారు. మంగళవారం బీజేపీ నేతృత్వంలో అండర్ బ్రిడ్జి వద్ద నిరసన వ్యక్తం చేశారు. వెంటనే అండర్ బ్రిడ్జిలో ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలు కల్పించాలని పట్టుపట్టారు. పోలీసులు జోక్యం చేసుకుని నిరసన కారులను తిప్పిపంపారు. బీజేపీ ఎమ్మెల్సీ సతీష్ బాబు, కార్పొరేటర్లు ఇబ్రహీం బాబు, తదితర బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం రోడ్డులో రాకపోకలు సాగించేందుకు వీలు కల్పిస్తామని అధికారులు పేర్కొన్నారని అందుకు నిరసన విరమిస్తున్నట్లు ఎమ్మెల్సీ పేర్కొన్నారు. కానీ బుధవారం కూడా రోడ్డు లో ప్రజలు తిరగేందుకు గేట్లు తెరవలేదు. అప్పుడు కూడా పోలీసులు వచ్చిన బీజేపీ నాయకులను తిప్పి పంపించారు. అంతే కాకుండా ఏకంగా ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పేరుతో సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. ఫిబ్రవరి 9న అండర్ బ్రిడ్జి రోడ్ల ప్రారంభం అని అందులో సారాశం. ఇలా అధికార పక్షం, ప్రతిపక్షం రెండూ రోడ్డు విషయంలో రోడ్డున పడుతున్నాయి. అయితే అండర్ బ్రిడ్జి రోడ్డు ప్రారంభం ఎప్పుడు అనేది అందుకు సంబంధించిన అధికారి తెలపాలి. ఏమీ సంబంధం లేని ఎమ్మెల్యే తేదీ ఖరారు చేయడం పై ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయి. ఎమ్మెల్యే అయితే అతిథిగా రావచ్చు. కానీ ఏకంగా ఇంత రాజకీయం చేయడం ఏమిటని ప్రతిపక్షాలు తప్పుపడుతున్నాయి. కొందరు ఎమ్మెల్యే తీరును ప్రశంసిస్తున్నారు. పైగా అక్కడ సువర్ణ బళ్లారి అనే పేరు పెట్టడం పై కూడా ప్రతిపక్షాలు తప్పుపడుతున్నాయి. 9వ తేదీనే ఎందుకు ఖరారు చేశారని ప్రశ్నిస్తున్నారు. బీజేపీ, ఇతర ప్రతిపక్షాలు మాత్రం కావాలనే ఇలా రాజకీయం చేస్తున్నాయని ఎమ్మెల్యే వర్గీయులు మండిపడుతున్నారు. ఇంత రాద్ధాంతం జరుగుతున్నా కలెక్టర్ నోరు మెదపకపోవడం ఆశ్చర్యకరం.



నిరసనలో బీజేపీ ఎమ్మెల్సీ సతీష్‌బాబు తదితరులు (ఫైల్)

తిరుమల నుంచి వస్తూ

తిరిగిరాని లోకాలకు..

- కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు రాయచూరు వాసుల మృతి

రాయచూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనం కోసం తిరుమలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఇద్దరు మృత్యువాత పడ్డారు. గురువారం రాత్రి ఏపీ రాష్ట్రం కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద చిత్తూరు-కర్నూల్ రాష్ట్ర రహదారిపై ప్రమాదం జరిగింది. రాయచూరు నగరంలోని ఐడీఎస్‌ఎంటీ కాలనీకి చెందిన ఓ కుటుంబ సభ్యులు తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. వారు ప్రయాణిస్తున్న వాహనం బోల్తా పడి ప్రమాదం జరిగింది. అతి వేగం కారణంగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో వాహనం బోల్తా కొట్టి ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే అందులో ప్రయాణిస్తున్న జానకి(60) అక్కడికక్కడే మృత్యువాతపడగా, నాల్గేళ్ల నిహారిక కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండడాన్ని గమనించారు. ఓర్వకల్లుకు చెందిన శ్రీనివాస్ నాయక్ అనే వ్యక్తి తన స్వంత వాహనంలో బాలికను కర్నూలు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృత్యువాత చెందింది. మరో 8 మందికి ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా స్థానికులు వారిని కర్నూలు జనరల్ ఆస్పత్రికి తరలించారు. వీరి మృతితో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. కుటుంబ వివరాలు తెలియాల్సి ఉంది.



బోల్తా పడిన వాహనం

నిరుద్యోగులకు భరోసాగా సబ్సిడీ రుణాలు

బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం

ఇంటర్వ్యూ



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సబ్సిడీ రుణాలు నిరుద్యోగ యువతకు భరోసాగా నిలుస్తాయని బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్ అందుబాటులో వచ్చిందని, అర్హులైన అన్ని కేటగిరీల వారు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. త్వరలోనే మరిన్ని రుణాలు వచ్చే అవకాశముందని తెలిపారు.

ప్రశ్న: ఐదేళ్ల తరువాత మంజూరైన రుణాలకు స్పందన ఎలా ఉంది..?

జవాబు: ఐదేళ్ల తరువాత వచ్చిన రుణాలు కాబట్టి చాలా మంది నిరుద్యోగులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రతి అంశంపైన క్షుణ్ణంగా అవగాహన కల్పించాం. తొలి రోజు నుంచే వెబ్‌సైట్‌లో ఎలాంటి సమస్యలు లేవు. అంతా సజావుగా సాగుతోంది.

ప్రశ్న: రుణాల ఎంపిక ప్రక్రియ ఎలా జరుగుతుంది..?

జవాబు: దరఖాస్తులు చేసుకున్న అనంతరం కార్పొరేషన్ పరిధిలోని వారికి మున్సిపల్ కమిషనర్, మండలాల పరిధిలో అయితే ఎంపీడీఓల ఆధ్వర్యంలో ఉన్న కమిటీ ద్వారా ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ఎంపికైన లబ్ధిదారుల జాబితాను వెరిఫికేషన్ చేసి కలెక్టర్‌కు పంపుతాం. అక్కడి నుంచి ఆమోదం పొందిన అనంతరం బ్యాంకర్ల వెరిఫికేషన్ జరుగుతుంది. అనంతరం లబ్ధిదారుల ఖాతాలకు రుణం జమవుతుంది.

ప్రశ్న: గతంలో మాదిరి సొసైటీలకు రుణాలు వచ్చే అవకాశం ఉందా..?

జవాబు: ఇప్పటి వరకూ వాటి మీద ఎలాంటి స్పష్టతా లేదు. బహుశా వాటిపైన కూడా త్వరలో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అదంతా పైస్థాయి అధికారుల నుంచి ఆదేశాలు రావాల్సిందే.

ప్రశ్న: ఆదరణ పథకం పునరుద్ధరిస్తారా..?

జవాబు: ఆదరణ పథకం ప్రస్తావన ఇంత వరకూ లేదు.

ప్రశ్న: మైనార్టీ కార్పొరేషన్‌కు ఇన్‌చార్జ్‌గా ఉన్నారు.. అక్కడ రుణాల పరిస్థితేంటి..?

జవాబు: మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి గతంలో అమలైన పథకాలు, యూనిట్లను అడిగారు. వాటిని సిద్ధం చేసి అధికారులకు నివేదికలు పంపాం. మైనార్టీ కార్పొరేషన్‌కు కూడా రుణాలు మంజూరు చేశారు. రూ.5 లక్షల యూనిట్లు, రూ.10లక్షల యూనిట్లు మంజూరయ్యాయి.

ప్రశ్న: క్రిస్టియన్ మైనార్టీల రుణాలు వచ్చాయా..?

జవాబు: క్రిస్టియన్ మైనార్టీలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 8 యూనిట్లు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన ఫైలును జిల్లా కలెక్టర్‌కు పంపారు. అక్కడి నుంచి ఆదేశాలు అందితే అందుకు సంబంధించి అవగాహన కల్పిస్తాం.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మేదర, కుమ్మరి, శాలివాహన కులాలకు చెందిన వారు సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మేదర, కుమ్మరి శాలివాహన కులాలకు చెందిన వారు ముగ్గురి నుంచి ఐదుగురి వరకు సంఘంగా ఏర్పడి రుణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రుణం మొత్తం రూ.3 లక్షలు కాగా... సబ్సిడీ రూ. 1.50 లక్షలు వర్తిస్తుందన్నారు. ఆయా కులాలకు చెందిన వారు http-s://apob-mms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆర్మ్‌డ్ గార్డు పోస్టుకు..

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా సంబులపూలకుంట వద్దనున్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో ఆర్మ్‌డ్ గార్డు పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి తిమ్మప్ప శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల మాజీ సైనికులు ఈనెల 11వ తేదీలోపు దరఖాస్తును అనంతపురంలోని జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 08554-241146 నంబరులో సంప్రదించాలన్నారు.

జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించనున్న పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని అరసం జిల్లా కార్యదర్శి నాసీల నాగేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఏపీ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా కవి జూపల్లి ప్రేమ్‌చంద్ రచించిన ఆధునిక తెలుగు వచన కవిత్వం-విభిన్న ధోరణులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు.

రైతన్న సేవలో సొసైటీలు

మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు

- కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటు
- జనఔషధి కేంద్రాల నిర్వహణ
- పెట్రోలు బంకులతో ఆదాయం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు రైతులకు రుణాలు మాత్రమే అందజేసిన సొసైటీలను బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. మరిన్ని సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, యంత్రాలు స్థానికంగానే అందుబాటులో ఉంచేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అందులో భాగంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)లను మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేసేందుకు శ్రీకారం చుట్టాయి. అన్నదాతకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను సొసైటీల ద్వారా నామమాత్రపు అద్దెతో అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. సొసైటీల కంప్యూటరైజేషన్ దాదాపుగా పూర్తి చేశారు. మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలను బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. గత ఐదేళ్లలో నిరాదరణకు లోనైన సొసైటీలు కొత్త కళను సంతరించుకోనున్నాయి. అసలే నష్టాల్లో ఊగిసలాడుతున్న సొసైటీలకు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. యూఎన్‌ఓ ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ సమావేశంలో 2025 ఏడాదిని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించింది. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార వ్యవస్థను పటిష్టం చేయనున్నాయి. పూర్వం గ్రామీణ ప్రాంతాల్లో సొసైటీలు అందించిన తరహాలోనే అన్ని రకాల సేవలను అందుబాటులోకి తీసుకురానున్నాయి.

జిల్లాస్థాయిలో కమిటీల ఏర్పాటు

గత ఐదేళ్లలో నిర్వీర్యమైన సొసైటీలను పటిష్టం చేయడానికి సంస్థాగతంగా చర్యలు చేపట్టారు. కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) కన్వీనర్‌గా ఉండే కమిటీలో జేసీ, ఐడీ్స సీఈఓ, పశుసంవర్ధక శాఖ జేడీ, మత్స్యశాఖ డీడీ, డీపీఓ, నాబార్డు డీడీఎంతోపాటు ఆయా సమన్వయ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. సొసైటీల్లో ఆన్‌లైన్ సేవలను ప్రారంభించి, అక్రమాలను అరికట్టి, రైతులకు మెరుగైన, నాణ్యమైన, పారదర్శక సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఆధునిక వ్యవసాయ పరికరాలు, డ్రోన్లు రైతులకు అందుబాటులోకి రానున్నాయి.

గోదాముల నిర్మాణం

జిల్లాలో రైతులు పండించిన పంటలను భద్రపరుచుకునేందుకు గోదాములను నిర్మించారు. వాటిని మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీల ద్వారా నిర్వహించనున్నారు. ఇదివరకు రైతులు పండించిన పంటలను కాపాడుకునేందుకు, గిట్టుబాటు ధర కోసం ఎదురుచూసే సమయంలో ప్రైవేటు గోడౌన్లను ఆశ్రయించాల్సి ఉండేది. ఇకపై ఆ పరిస్థితులు ఉండకూడదనే ప్రభుత్వం సొంతంగా గోడౌన్లను నిర్మించి, నామమాత్రపు అద్దెతో రైతులకు అందుబాటులోకి తీసుకురానుంది. జిల్లాలో మొత్తం 101 గోడౌన్లకుగాను 54 నిర్మాణం పూర్తిచేసి, అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన 47 నిర్మాణ దశలో ఉన్నాయి. త్వరలో పూర్తిచేసేలా పనులు వేగంగా సాగుతున్నాయి.

కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సేవలను రైతులు పొందేందుకు వీలుగా కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీలు) ఏర్పాటు చేయనున్నారు. మీసేవ కేంద్రాల తరహాలో అన్నిరకాల సేవలను అందించనున్నారు. మొబైల్ రీచార్జి మొదలుకుని విద్యుత్తు బిల్లులు, రవాణాకు సంబంధించి బస్సు, రైల్వే, విమాన టిక్కెట్ల బుకింగ్ ఇలా మొత్తం సీఎస్‌సీల ద్వారా అందించనున్నారు.

జనఔషధి కేంద్రాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రజలకు తక్కువ ధరకే జనరిక్ మందులు అందుబాటులో ఉంచేందుకు జనఔషధి కేంద్రాలుగా మార్పు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు ఆరు కేంద్రాలను మంజూరు చేశారు. జిల్లాకేంద్రంలోని డీసీఎంఎస్ ఆవరణలో ఇప్పటికే ప్రారంభించారు. మిగిలిన జన ఔషధి కేంద్రాలు ఆయా ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. రాచానపల్లి, ముచ్చుకోట, గుంతకల్లు, రాయదుర్గం ఉద్దేహాళ్, కళ్యాణదుర్గం చాపిరిలో ప్రారంభించనున్నారు.

పెట్రోలు బంకుల ద్వారా వ్యాపారం

మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీల ద్వారా పెట్రోలు బంకులు నిర్వహించి, ఆదాయం వచ్చేలా చేస్తున్నారు. రైతులకు రుణాలను అందిస్తూనే ఇలాంటి సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. జిల్లాకు మొదటి విడతలో 5 పెట్రోలు బంకులు మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల పొలాలు, ఇతర రవాణాకు అవసరమయ్యే పెట్రోలు, డీజిల్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇప్పటికే యల్లనూరులో ప్రారంభించారు. కణేకల్లు, నార్పల, ఆమిద్యాల, కూడేరులో ప్రారంభించేందుకు పనులు చేపడుతున్నారు.



యల్లనూరులో సొసైటీ నిర్వహిస్తున్న పెట్రోలు బంకును పరిశీలిస్తున్న సహకార శాఖ అధికారులు

ఎరువుల పంపిణీ కేంద్రాలుగా సొసైటీలు

రైతులకు స్థానికంగా వ్యవసాయ పనులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ ఆధునిక యంత్ర పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా ఏర్పాటు చేసి ఈ సేవలు అందించనున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ యంత్ర పరికరాలు, డ్రోన్లను నామమాత్రపు అద్దెతో రైతులకు అందించేందుకు చర్యలు చేపట్టారు. రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు అందించేందుకు, సీడ్ సొసైటీ, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఆర్గానిక్ సొసైటీ, రైతులు పండించిన పంటలను ఎగుమతి చేసేందుకు ట్రాన్స్‌పోర్ట్ సొసైటీలతో సహకార సొసైటీలను అనుసంధానం చేస్తున్నారు.

అనేక ప్రయోజనాలు



మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేయడంతో రైతులకు అనేక ప్రయోజనాలు కలగనున్నాయి. సొసైటీల కంప్యూటరీకరణతో పారదర్శక సేవలు అందనున్నాయి. ప్రజలకు చౌకగా సేవలు అందించడం, సొసైటీలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్రోలు బంకులు, జనఔషధి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. డ్రోన్ వంటి వ్యవసాయ సాంకేతిక ఆధునిక పరికరాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు స్థానికంగానే వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉంచడమే మల్టీపర్పస్ క్రెడిట్ సొసైటీల ఏర్పాటు ప్రధాన ఉద్దేశం.

-అరుణకుమారి, జిల్లా సహకార శాఖాధికారి

మీ పనితీరుతో బ్యాంకు సర్వనాశనం

కంప్యూటరైజేషన్ పేరుతో రుణాల రెన్యువల్‌ను వదిలేస్తారా..?

బోర్డు సమావేశంలో జేసీ ఆగ్రహం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మీ పనితీరుతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకును సర్వనాశనం చేస్తున్నారని అధికారులపై జాయింట్ కలెక్టర్, ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి శివనారాయణ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో శుక్రవారం ఏడీసీసీ బ్యాంకు బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్‌లు, అంశాలు, సొసైటీల వారిగా ఆయన సమీక్షించారు. బ్యాంకు ఎన్‌పీఏ రోజురోజుకు పెరిగిపోతోం దని, వసూలు చేసిన మొత్తాన్ని డిపాజిట్ చేయకుండా సొంతానికి ఎలా వాడుతారని ప్రశ్నించారు. 20-30ఏళ్ల నుంచి పని చేస్తున్న అధికారులు కనీస పురోగతి లేకుండా కాలక్షేపం చేస్తూ, జీతాలు తీసుకుంటే సరిపోదన్నారు. తదుపరి సమీక్షా సమావేశానికి ప్రోగ్రెస్ లేని వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కంప్యూటరైజేషన్ పేరుతో రైతుల పంట రుణాలు రెన్యువల్ చేయలేదని, కనగానపల్లి సొసైటీలో రూ.ఆరు కోట్లకు గాను ఒక్క పైసా కూడా రెన్యువల్ చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పంట రుణాలు రెన్యువల్ చేయడంలో అధికారులు అందరూ ఫెయిల్యూర్ అంటూ అసహనం వ్యక్తం చేశారు. మేనేజర్లు, అధికారులు ఆఫీస్‌లో ఏసీల్లో కూర్చుని జీతాలు తీసుకుంటే కుదరదని, కచ్చితంగా క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే. రుణాలు రికవరీ చేయాల్సిందేనని హెచ్చరించారు. బుక్కరాయసముద్రం సొసైటీ పరిధిలో మార్ట్‌గేజ్‌లో ఉన్న భూములను ప్రభుత్వ అధికారులు కొనుగోలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, సుమారు 25కి పైగా కేసులు ఉన్నట్లు సూచించారు. ఇటు బ్యాంకు, అటు సొసైటీలకు ప్రతి అంశంలోనూ పురోగతి వచ్చేలా పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, డీజీఎంలు రాంప్రసాద్, సుఖదేవబాబు, విజయచంద్రారెడ్డి, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు అవే అవార్డు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న విరుపాక్షకు అవే సంస్థ అవార్డు దక్కింది. అవే జాతీయ అవార్డుల ప్రదానోత్సవం గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ, అవే సంస్థ వ్యవస్థాపకులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి చేతుల మీదుగా కానిస్టేబుల్ విరుపాక్ష అవార్డును అందుకున్నారు. వివిధ శాఖల్లో నిజాయతీపరులైన అధికారులకు అవే సంస్థ అవార్డులు అందజేసింది. కళ్యాణదుర్గానికి చెందిన విరుపాక్ష గత 15ఏళ్లుగా కానిస్టేబుల్‌గా అనంతపురంలో పనిచేస్తున్నారు. అవే అవార్డు అందుకున్న విరుపాక్షకు పలువురు అభినందనలు తెలిపారు.



విరూపాక్షను అవార్డుతో సత్కరిస్తున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ, అవే వ్యవస్థాపకుడు వైకుంఠం ప్రభాకర్ చౌదరి

ఆటలతో ఆరోగ్యం: డీఐజీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 విజయవంతంగా ముగిసింది. పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషి, ఎస్పీ జగదీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ పండుగ వాతావరణంలో జరిగిందని, క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డీఐజీ అన్నారు. చురుకుగా విధులు నిర్వర్తించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. అధికారులు, సిబ్బందికి పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఎస్పీ అన్నారు. డిసెంబరు నెల చివరి రెండు రోజులు ఈ కార్యక్రమం నిర్వహించామని, కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కారణంగా ముగింపు కార్యక్రమం ఈ రోజు నిర్వహిస్తున్నామని అన్నారు. పోలీసు శాఖలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, దేహదారుడ్యం కలిగి ఉండటం చాలా ముఖ్యమని అన్నారు. రేంజ్, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలలో ప్రతిభ చాటాలని, జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, జ్ఞాపికలను డీఐజీ, ఎస్పీ అందజేసి, అభినందించారు. ముగింపు రోజు టగ్ ఆఫ్ వార్, 100 మీటర్లు, 5 కి.మీ. పరుగు పందేలు, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. టగ్ ఆఫ్ వార్ విన్నర్స్‌గా జిల్లా ఎస్పీ జట్టు, రన్నర్స్‌గా అదనపు ఎస్పీ జట్టు నిలిచాయి. ఓవరాల్ ఛాంపియన్‌గా ఏఆర్ పోలీస్ జట్టు నిలిచింది. వ్యక్తిగత విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌గా ఏఆర్ కానిస్టేబుల్ జయచంద్ర, హెడ్ కానిస్టేబుల్ సరోజ నిలిచారు. కార్యక్రమంలో తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి, ఏఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్ బాషా, డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేష్, రవిబాబు, శ్రీనివాస్, మహబూబ్‌బాషా, ట్రైనీ డీఎస్పీ అస్రాఫ్ అలీ, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ అధికారుల సంఘం నాయకులు త్రిలోక్‌నాథ్, జాఫర్, హరినాథ్, తేజ్‌పాల్, శ్రీనివాసులు నాయుడు, లక్ష్మీనారాయణ, సరోజ తదితరులు పాల్గొన్నారు.



పరుగు పందెంలో తలపడుతున్న పోలీసులు



టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న ఎస్పీ జగదీష్



పురుషుల విభాగంలో ఓవరాల్ చాంపియన్ జయచంద్రకు ట్రోఫీ అందజేస్తున్న డీఐజీ, ఎస్పీ



మహిళల విభాగంలో ఓవరాల్ చాంపియన్ సరోజకు ట్రోఫీ అందజేస్తున్న డీఐజీ, ఎస్పీ



పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజుతో సమావేశమైన ఎంపీ అంబికా

జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ నిధులివ్వాలి

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజుకి ఎంపీ అంబికా వినతి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అనంత జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు మంజూరు చేయాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజుని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఢిల్లీలో శుక్రవారం ఎంపీల బృందంతో కలిసి జిల్లాకు సంబంధించిన ముఖ్య సమస్యలను అంబికా.. మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే రెండో జిల్లా అనంత కావడంతో ప్రత్యేక ప్యాకేజీ నిధులు మంజూరు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించే అవకాశం కల్పించాలని కోరారు.

వైసీపీలో చేరిన మాజీ మంత్రి శైలజానాథ్



అనంతపురం, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ వైసీపీలో చేరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన డీసీసీ మాజీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డితో కలిసి వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. జగన్ సమక్షంలో వారిద్దరూ వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి, పార్టీ పదవికి రాజీనామా చేసి వైసీపీలో చేరానన్నారు. జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయాలనే నిర్ణయం తీసుకున్నానన్నారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. శైలజానాథ్ వెంట వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు వై. విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డితో పాటు కడప జిల్లాకు చెందిన ముఖ్య నాయకుడు వేంపల్లి సతీష్‌రెడ్డి ఉన్నారు.

నెట్టికంటి ఆంజనేయుడి సేవలో ముస్లిం దంపతులు

బంగారు నామాలు సమర్పణ

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామికి ముస్లిం దంపతులు బంగారు నామాలను శుక్రవారం అందజేశారు. అనంతపురానికి చెందిన రజియా, ఎస్ బాషా దంపతులు స్వామివారికి రూ.8లక్షల విలువచేసే 90 గ్రాముల బంగారు నామాలను ఆలయ ఉప ప్రధానార్చకుడు అనంతాచార్యుల ద్వారా అధికారులకు అందజేశారు. స్వామి వారికి మొక్కు తీర్చుకోవడంలో భాగంగా బంగారు నామాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు.



ముస్లిం దంపతులు సమర్పించిన నామాలు

జాతీయ రగ్బీ పోటీలకు ఎంపిక



కడపల రిత్విక

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ రగ్బీ పోటీలకు నగరానికి చెందిన కడపల రిత్విక ఎంపికైంది. ఈనెల 11వతేదీ నుంచి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో నిర్వహించే ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి అండర్-15 రగ్బీ బాలికల పోటీల్లో రాష్ట్రం తరఫున రిత్విక ప్రాతినిధ్యం వహించనుంది. స్థానిక సెయింట్ డీపాల్ స్కూల్‌లో రిత్విక ఆరో తరగతి చదువుతోంది. రిత్వికకు పలువురు అభినందనలు తెలిపారు.

గోడ కూలి ముగ్గురు విద్యార్థులకు గాయాలు

విడపనకల్లు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం గోడ కూలి ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాఠశాలలో తాగునీటి కుళాయికి ఏర్పాటుచేసిన గోడ నీటి తేమకు తడిసిపోయింది. ముగ్గురు విద్యార్థులు కుళాయిల వద్దకెళ్లి తాగునీరు పట్టుకుంటుండగా గోడ ఒక్కసారిగా విరిగి విద్యార్థులపై పడింది. దీంతో చీకలగురికి గ్రామానికి చెందిన నవీన్ అనే విద్యార్థికి కాలు విరిగింది. రవీంద్ర, జగన్ అనే విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. నవీన్‌ను బళ్లారి ఆస్పత్రికి తరలించి, చికిత్సలు చేయించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

నేడు రాప్తాడు రైల్వే గేటు బంద్

రాప్తాడు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపానగల రైల్వే గేటును శనివారం బంద్ చేయనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రైల్వే ఫ్లై ఓవర్ పనుల మరమ్మతుల్లో భాగంగా గేటు తాత్కాలికంగా మూసి వేయనున్నట్లు తెలిపారు. రాప్తాడు నుంచి పంగల్ రోడ్డు మీదుగా అనంతపురానికి వాహన రాకపోకలు ఉండవన్నారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించి, ఇతర మార్గాల గుండా వెళ్లాలని సూచించారు.

ఎకరాకు 4 క్వింటాళ్లదాకా కంది కొనుగోలు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సీఎం యాప్ అప్‌డేట్ చేసిన నేపథ్యంలో ఎకరాకు 4 క్వింటాళ్ల దాకా కందులు కొనుగోలు చేస్తున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని రైతు సేవాకేంద్రాల్లో 8వేల మంది రైతులు పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఇప్పటిదాకా 2వేల మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేశామన్నారు. 362 మంది రైతులకు రూ.3 కోట్లు సొమ్ము జమ చేసేలా బ్యాంకుకు పంపామన్నారు. తొలుత సీఎం యాప్‌లో ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చినట్లు చూపించిందన్నారు. ఉన్నతాధికారులు యాప్‌ను అప్‌డేట్ చేయడంతో ఎకరాకు 4 క్వింటాళ్లదాకా దిగుబడి వచ్చినట్లు చూపుతోందన్నారు. ఆ మేరకు ఎకరాకు 4 క్వింటాళ్లదాకా కందులు కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలోని రైతులు వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కేశ్ శంకరనారాయణ కాయ్...

వీణ వెంకటరమణ దాస్ (జయంతి)



వీణ వెంకటమరణ దాస్ 1866 ఫిబ్రవరి 8న సంగీతకారుల కుటుంబంలో జన్మించారు. ఆయన తాత, మైసూరు వీణ శేషణ్ణలు అన్నదమ్ములు. విజయనగర ఆస్థానంలో వీణా వాదకుడిగా చోటు పొందారు. ఆయన నివసించిన ప్రదేశం కాలక్రమంలో వీణావారి వీధిగా పేరొందింది. ఆయన సితార్, రుద్రవీణ వాదనలోనూ రాణించారు. షట్‌కళా చక్రవర్తి బిరుదు పొందారు. 'వీణ రహస్య ప్రకాశిక' అనే పుస్తకాన్ని రచించగా ఇందులో 12 సంస్కృత శ్లోకాలతో వీణ వాదనలోని కిటుకులు పొందుపరిచారు. 1948 ఫిబ్రవరి 28న పరమపదించారు.

శోభా గుర్టు (జయంతి)



హిందూస్థానీ శాస్త్రీయ సంగీతంలో 'ఠుమ్రీ క్వీన్'గా పేరొందిన శోభా గుర్టు 1925 ఫిబ్రవరి 8న బెళగావిలో జన్మించారు. సెమీ క్లాజికల్‌లో భాగంగా ఠుమ్రీ, దాద్రా, కజ్రీ, హోరి వంటి వాటిలో రాణించారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యటించి కచేరీలు ఇచ్చారు. హిందీ, మరాఠీ సినిమాలలోనూ నటించారు. ఐదు దశాబ్దాల సేవలకు సంగీత నాటక అకాడమీ అవార్డు, లతా మంగేష్కర్ పురస్కార్, సాహు మహరాజ్ పురస్కార్, పద్మభూషణ్ తదితర అవార్డులు దక్కాయి. 2004 సెప్టెంబరు 27న కన్నుమూశారు.

జగ్జీత్ సింగ్ (జయంతి)



'గజల్ కింగ్'గా పేరొందిన మరపురాని మధురగీతాలు, గజల్స్‌ను ఆలపించిన నేపథ్యగాయకుడు జగ్జీత్‌సింగ్ 1941 ఫిబ్రవరి 8న రాజస్థాన్ రాష్ట్రం గంగాధర్ ప్రాంతంలో జన్మించారు. హిందీ, ఉర్దూ, పంజాబీ, బెంగాలీ, గుజరాతీ, నేపాలీ భాషలలో గజల్స్ ఆలపించారు. పద్మభూషణ్, రాజస్థాన్ రత్న, సాహిత్య అకాడమీ అవార్డు, లతా మంగేష్కర్ సమ్మాన్ తదితర పురస్కారాలు పొందారు. 2011 అక్టోబరు 10న కన్నుమూశారు.

పొత్తూరి వెంకటేశ్వర రావు (జయంతి)



పాత్రికేయ రంగంలో తనదైన గుర్తింపు పొందిన పొత్తూరి వెంకటేశ్వరరావు 1934 ఫిబ్రవరి 8న గుంటూరు జిల్లాలో పొత్తూరులో జన్మించారు. 50 ఏళ్ల సుదీర్ఘకెరీర్‌లో పలు పత్రికలలో పని చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్‌లో గెస్ట్ లెక్చరర్‌గా బోధనలు చేశారు. పత్రికా సంపాదకులుగా, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆధ్యాత్మిక అంశాలు, తెలుగు మహనీయులు, పత్రికా విలువలు, సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ మొదలైన అంశాలపై రచనలు చేశారు. 2017లో ఏపీ ప్రభుత్వం నుంచి కళారత్న పురస్కారం అందుకున్నారు. 2020 మార్చి 5న కన్నుమూశారు.

కేఎం మున్షీ (వర్ధంతి)



భారతీయ విద్యాభవన్ ఫౌండర్, విశ్వహిందూ పరిషత్ సంస్థాపక సభ్యులలో ఒకరైన కన్హయలాల్ మాణెక్‌లాల్ మున్షీ 1887 డిసెంబరు 30న జన్మించారు. 'ఘనశ్యామ్ వ్యాస్' కలం పేరిట గుజరాతీ, ఇంగ్లీషు, హిందీ భాషలలో రచనలు చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. గుజరాత్‌కు చెందిన ఆయన రచయిత, విద్యావేత్త, రాజకీయ నాయకుడిగా రాణించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయినా రచనలు, రాజకీయాలకే పరిమితమయ్యారు. రాజ్యాంగ నిర్మాణ కమిటీ సభ్యులలో ఒకరు. ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గాను, కేంద్రమంత్రిగాను వ్యవహరించారు. 1971 ఫిబ్రవరి 8న కన్నుమూశారు.

మొహమ్మద్ అజారుద్దీన్ (పుట్టినరోజు)



అజర్‌గా పేరొంది 'పద్మశ్రీ' గ్రహీత మొహమ్మద్ అజారుద్దీన్ 1963 ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో జన్మించారు. భారత క్రికెట్‌జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్‌గా రాణించారు. 99 టెస్టులు, 334 వన్డే మ్యాచ్‌లు ఆడారు. అర్జున అవార్డు, ఇతర పురస్కారాలు పొందారు. 2009 నుంచి 2014వరకు ఎంపీగా కొనసాగారు. 2019లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో కీలకంగా ఉన్నారు. 2023లో న్యూఢిల్లీలోని జామియా హమ్‌దర్ద్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

ఏడాదంతా ఉపాధి కల్పించండి



తహసీల్దారు సుజాతకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

బంగారపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించాలని, సహకార బ్యాంకులకు నబార్డు ఇస్తున్న వ్యవసాయ రుణాలను ఆపేసే ఆదేశాలను వాపసు తీసుకోవాలని, మైక్రో ఫైనాన్స్ వేధింపుల నియంత్రణకు బలమైన చట్టాలు తేవాలని రైతుసంఘం డిమాండ్ చేసింది. తహసీల్దారు సుజాతకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణగౌడ మీడియాతో మాట్లాడుతూ ఆరోగ్య, విద్య, శ్రామిక తదితర రంగాలకు ఉపాధి కల్పించేలా చట్టం రూపొందించాలని కోరారు. ఉచితంగా ఎటువంటి గ్యారెంటీ పథకాలు అమలు చేయకుండా చట్టాలు తేవాలని, అన్న భాగ్య పథకంలో పేదలకు 10 కేజీల బియ్యం పంపిణీ చేయాలన్నారు. బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న రేషన్ బియ్యాన్ని అడ్డుకోవాలన్నారు. రైతులపై ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు అన్నదాతల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని, ఎంఎన్‌సీలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ తమ ప్రతాపాన్ని చూపుతున్నారని, నబార్డు నుంచి ఇచ్చే రుణాలను ఆపేయడం ద్వారా రైతు వ్యతిరేక విధానాలు పాటిస్తున్నారంటూ మండిపడ్డారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్ళి మంజునాథ, తాలూకా అధ్యక్షుడు కదరినత్త అప్పోజిరావ్, లక్ష్మణ్, చాంద్‌పాష, కిరణ్, బాబాజాన్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని 10న ధర్నా



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పాల ఉత్పత్తిదారుల సంఘం నాయకులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పాలబకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బెంగళూరులోని కర్ణాటక పాల మహామండలి కార్యాలయం వద్ద ఈనెల 10న ధర్నా చేయనున్నట్టు రాష్ట్రరైతుసంఘం, హసిరుసేన రాష్ట్ర అధ్యక్షుడు భక్తరహళ్ళి భైరేగౌడ తెలిపారు. పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పాల బకాయిలు విడుదల చేయాలని, పాలధర పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నీటికి కొరత ఉన్నా పాలకు కొరతలేదన్నారు. రాష్ట్రంలో సుమారు 25లక్షలమంది రైతు కుటుంబాలు 15,450 పాల ఉత్పత్తిదారులసంఘాల ద్వారా 16 పాలమండలిలకు నిత్యం 80లక్షల లీటర్ల పాలు సరఫరా చేస్తున్నామన్నారు. పశు ఆహారంతోపాటు బూసా, ఇండి, చెక్క మిశ్రమం వంటి అన్ని ధరలు పెరిగాయన్నారు. సగటున పాల ఉత్పత్తికి సుమారు 50 రూపాయల ఖర్చు వస్తుందన్నారు. స్వామినాథన్ నివేదిక ప్రకారం లీటరుకు రూ.76 ఇవ్వాల్సి ఉండగా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. కాగా జనవరి 1న ముఖ్యమంత్రి రూ.5 పెంచుతామని హామీ ఇచ్చారని నెలరోజులు దాటినా ఇంతవరకు అమలు కాలేదన్నారు. ప్రతి లీటరుకు కనీసధర రూ.50 ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతుసంఘం మునినంజప్ప, కెంపరెడ్డి, మళమాచనహళ్ళి రమేశ్, దేవరాజ్, భీమణ్ణ, నారాయణస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి స్టోనా ప్రదర్శనలు



మీడియాతో మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

బెంగళూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయస్థాయి గ్రానైట్ ప్రదర్శనలు (స్టోనా) 2025 ఈనెల 12నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. దేశ ఆర్థిక, సాంస్కృతిక పరంపరకు గ్రానైట్ పరిశ్రమ కీలకంగా ఉందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ గ్రానైట్ అండ్ స్టోన్ ఇండస్ట్రీ (ఎఫ్ఐజీఎస్ఐ) అధ్యక్షులు కృష్ణ ప్రసాద్ తెలిపారు. ప్రదర్శనలకు సంబంధించి ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ సింగ్, స్టోనా 2025 అధ్యక్షులు మదన్‌లాల్ జంగిర్, కేశవమూర్తి, హిమాన్షు సెహగల్‌లు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా గ్రానైట్ పరిశ్రమల పరిశోధకులు పాల్గొంటారన్నారు. మూడు రోజులపాటు సాగే ప్రదర్శనలకు కనీసం లక్షమందికిపైగా సందర్శకులు హాజరవుతారని భావిస్తున్నామన్నారు. గ్రానైట్ పరిశ్రమలో పాలసీలు పారిశ్రామిక సలహాలతోపాటు ఆధునిక యంత్రాలకు సంబంధించి ప్రదర్శనల ద్వారా మరింతమందికి అవగాహన పెరుగుతుందన్నారు. 50ఏళ్లుగా రాయల్టీలో మార్పు డిమాండ్ చేస్తున్నామని, ప్రభుత్వదృష్టికి తీసుకెళ్లదలిచామన్నారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్, తమిళనాడులోని హోసూరులలో రెండు అత్యాధునిక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను స్థాపించామని, వృత్తిపరమైన అవగాహనలు పెంచేందుకు కట్టుబడ్డామన్నారు. ప్రదర్శనలను గనులు, ఉద్యానవనశాఖ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున, రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి ప్రారంభిస్తారన్నారు. గ్రానైట్ పరిశ్రమలో సాధకులకు పురస్కారాలు అందిస్తామన్నారు. శిల్పి అరుణ్ యోగిరాజ్‌ను సత్కరించదలిచామన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



రూపనగుడి రోడ్డులో బియ్యం స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బ్లాక్ మార్కెట్ తరలించడానికి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో పేద ప్రజల నుండి గుట్టుచప్పుడు కాకుండా ఇంటింటి నుండి కొనుగోలు చేసిన దందా కోర్లు ఇపుడు ఏకంగా చౌకధాన్యం డిపోల నుంచే నేరుగా తీసుకెళుతున్నారంటే అక్రమ బియ్యం దందా ఎలా పెరిగిపోయిందో తెలుసుకోవచ్చు. నగరంలోని 9వ డివిజన్ పరిధిలోని రూపనగుడి రోడ్డులో ఉన్న ఓ చౌకధాన్యం డిపోకు ప్రజల పంపిణీ కోసం గోడౌన్ నుండి శుక్రవారం సాయంత్రం సమయంలో బియ్యాన్ని సరఫరా చేశారు. అయితే అలా సరఫరా చేశారో లేదో... గంట వ్యవధిలోనే చౌకధాన్యం డిపోలో గన్నిబ్యాగ్స్ నుంచి ప్లాస్టిక్ సంచుల్లో మారుస్తున్నట్లు శబ్దాలు వస్తున్నట్టు విషయాన్ని గమనించారు. చుట్టుప్రక్కల ప్రజలు ఆహార పౌరసరఫరా అధికారులకు సమాచారాన్ని చేరవేశారు. విషయం తెలుసుకున్న ఆహార పౌరసరఫరా శాఖ చౌకధాన్యం డిపోవద్దకు చేరుకోగానే డిపోవద్దకు రాత్రి 8గంటల సమయంలో చేరుకోగా... స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున గుమిగూడారు. అధికారుల రాకతో ప్యాక్ చేస్తున్న వారు ఒక్కసారిగా లైట్ ఆఫ్ చేశారు. విషయాన్ని పసిగట్టిన ఆహార పౌరసరఫరా అధికారుల స్థానిక బ్రూస్‌పేట పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసుల సమక్షంలోనే చౌకధాన్యం డిపో బయట వేసి తాళాన్ని పగలగొట్టి చూడగా, లోపల పీడీఎస్ సంచుల నుంచి ప్లాస్టిక్ సంచుల్లోకి బియ్యాన్ని మార్చి మిషన్‌తో స్టిచ్చింగ్ వేసిన ప్లాస్టిక్ సంచులు పరిశీలించిన అధికారులు అక్రమంగా బియ్యం సాగించేందుకు సిద్ధం చేసినట్టు అంగీకరించారు. చౌకధాన్యం డిపోలో 121 ప్లాస్టిక్ సంచుల్లో సుమారు 60 క్వింటాళ్ళ బియ్యం సంచులు మార్చినట్లు అధికారులు నిర్ధారించారు. అయితే తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్ళే సరికి... అప్పటి వరకు లోపలి ఉన్న వారు ఎవరూ లేకపోవడంతో అధికారులు ఆశ్చర్యపోయారు. అప్పటి వరకు ఉన్న లోపల ఉన్న వ్యక్తులు ఉన్న ఫళంగా కనిపించక పోయే సరికి అధికారులో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. లోపల ఉన్నది స్టోర్ డీలరా... లేక పోతే మరెవరైనా బయటి వ్యక్తులు ఉన్నారా అనే విషయంపై తెల్లవారితే తప్ప తెలియదని, చౌకధాన్యం డిపోనుసీజ్ అధికారులు వెళ్ళిపోయారు.

పనులు పూర్తి చేయండి



రోడ్డు మధ్యలో గుంతలతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

కంప్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలో పదవ వార్డులో జరుగుతున్న రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని వార్డు ప్రజలు కోరుతున్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు మాట్లాడుతూ పనుల నిమిత్తంగా రోడ్డు మధ్యలో గుంతలు తీయడం వల్ల అంగన్‌వాడీ పాఠశాల చిన్నారులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఎన్నోసార్లు కాల్వలో పడి గాయాలపాలయ్యారన్నారు. ఈ విషయంపైన పట్టణ పంచాయతీ అధికారులకు తెలిపిన వారికి చీమకుట్టినట్లు కూడా లేకపోయిందని వాపోతున్నారు. వార్డు ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో వుంచుకుని వెంటనే పనులు పూర్తి చేసి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులు కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రాయచూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వర కాలనీలో తాళం వేసిన ఇంట్లో దొంగలు దొంగతనానికి పాల్పడ్డారు. ఈ నెల 1వ తేదీన బెంగళూరులో వివాహం కోసం కుటుంబ సభ్యులందరూ బెంగళూరుకు వెళ్లగా దీన్ని అదునుగా భావించిన దుండగులు ఇంటి వెనక్కి భాగంలోని తలుపుల గుండా లోనికి ప్రవేశించి 5కిలోలు వెండి, రూ.50 వేలు నగదు, విలువైన బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. దాదాపు 4 నుంచి 5 లక్షల మేరకు విలువగల వస్తువులు దొంగతనానికి గురైనట్లు కుటుంబస్తులు గుర్తించారు. ఐదవ తేదీన బెంగళూరు నుంచి తిరిగి వచ్చిన సభ్యులు ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెస్ట్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మనస్సుకు హత్తుకునేలా..!

- ప్రభుత్వ పాఠశాలలకు కొత్త సొబగులు
- పిల్లలను ఆకట్టుకునేందుకు గోడలపై చిత్రాలు
- 'మనస్సు' బృందానికి పలువురి అభినందనలు



గంగావతి రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు తగ్గిపోతున్న తరుణంలో విద్యార్థులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలలను కాపాడండి... అభివృద్ధి పరచండి అనే సందేశానికి " కన్నడ మనస్సు బృందం "అనే స్వచ్ఛంద సంస్థ 2018 నుంచి రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లాల్లో అభివృద్ధి పనులు చేపడుతూ వస్తోంది. స్వయం సేవకులుగా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఉత్తమ కార్యక్రమాలు నిర్వహిస్తూ పాఠశాల గోడలపై ఆకట్టుకునే బొమ్మలు వేస్తూ విద్యార్థులను పాఠశాలల వైపు దృష్టి సారించే ప్రయత్నం చేస్తుండడం విశేషం. ఆరేళ్ళుగా కన్నడ మనస్సు బృందం శక్తి, సంపత్తు, ప్రజల సహకారంతో ఇప్పటి వరకు 55 కిపైగా ప్రభుత్వ పాఠశాలలకు కొత్త రూపం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. ఈ బృందం తన 55వ పాఠశాలను కొప్పళ జిల్లా కుష్టగి తాలూకా హొలగేరి ప్రభుత్వ మాదిరి ప్రాథమిక పాఠశాలను ఎన్నిక చేసుకుంది. గ్రామస్తులు, పాఠశాల పాత విద్యార్థులు, ఎస్‌డీఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు సలహా, సహకారం, సహాయంతో పాఠశాల అభివృద్ధికి కంకణం కట్టుకుంది. మనస్సు బృందం సహకారంతో హొలగేరి ప్రభుత్వ పాఠశాలకు కొత్త రూపం వచ్చింది. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహాయాన్ని సంఘ సంస్థలు, పాత విద్యార్థులు, స్థానిక ప్రముఖులు, గ్రామస్థుల ద్వారా పొంది కన్నడ మనస్సు బృందం మనోభావన, శ్రమ, సముదాయ ప్రోత్సాహంతో ప్రభుత్వ పాఠశాల కాపాడడంతో ఈ బృందాన్ని పలువురు అభినందిస్తున్నారు.





పాఠశాల గోడలపై ఆకట్టుకుంటున్న చిత్రాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రాఘవేంద్రుడికి విశేష పూజలు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో మధ్వనవమిని పురస్కరించుకుని గురువారం విశేషపూజలు నిర్వహించారు. రాఘవేంద్రసేవా ట్రస్టు అధ్యక్షుడు ఎస్‌వీ నాగరాజరావ్ మాట్లాడుతూ తత్వజ్ఞాని, ఆచార్య మధ్వాచార్యుల స్మరణార్థం మధ్వనవమిని ఆచరిస్తున్నట్లు తెలిపారు. ద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన మధ్వాచార్యుల సేవలను ప్రస్తుతించారు. మధ్వాచార్యులు బదరికాశ్రమంలోకి ప్రవేశించిన దినంగా పేర్కొన్నారు. దీన్ని మధ్వనవమిగా వ్యవహరిస్తారన్నారు. మధ్వాచార్యుల జీవనం, ఆధ్యాత్మిక పరంపరను గౌరవించడమే కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. ఆయన చూపిన మార్గంలో పద్మనాభతీర్థ, జయతీర్థ, పాదరాజరు, వాదిరాజరు, వ్యాసతీర్థ, విజయేంద్రతీర్థ, రఘోత్తమతీర్థ, పురందరదాస, కనకదాస వంటివారు ఎంతో కృషి చేశారన్నారు. కలియుగంలో దీనులపాలిట దైవంగా మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఉన్నారన్నారు. విశేషపూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం



పూజల్లో పాల్గొన్న స్వామీజీలు

బెంగళూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): యశ్వంతపురలోని 300ఏళ్ల పురాతనమైన అభయాంజనేయస్వామి ఆలయ గోపుర మహాకుంభాభిషేకం శుక్రవారం జరిగింది. ఆలయ జీర్ణోద్ధరణ, శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస విగ్రహాలను ప్రతిష్ఠించారు. కోడిమఠాధిపతి శివానంద శివయోగి రాజేంద్ర స్వామిజీ, యదుగిరి యతిరాజ మఠం యతిరాజ రామానుజజీయర్ స్వామిజీ, రెడ్డిగురుపీఠం వేమనానందస్వామిజీలతోపాటు ఆలయ ట్రస్టు పదాధికారులు విక్రమ్ ప్రభాకర్, విశ్వనాథరెడ్డి, మంజునాథ్, రవీంద్ర, రాకేశ్, అరుణ్‌రెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

చేళూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన చేళూరు పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. చేళూరు బస్టాండ్ ప్రాంతంలో కందుకూరు మార్గంలోనూ, బాగేపల్లి రూట్‌లోనూ, చింతామణి మార్గంలోనూ విద్యుత్‌స్తంభాలకు అనుగుణంగా సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇటీవలికాలంలో దోపిడీ దొంగల నిందితులను సీసీ కెమెరాల ఫుటేజీల సాయంతో పట్టుకున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా నేరాల నియంత్రణకు సీసీటీవీల ఏర్పాటు అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఇసుక అక్రమ తరలింపు

- తెప్పలతో తోడుకుని టిప్పర్లతో అమ్మకాలు..



హడగలి వద్ద తెప్పల ద్వారా ఇసుకను తరలిస్తున్న దృశ్యం

కంప్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిలో అక్రమంగా తెప్పల ద్వారా ఇసుక మళ్లిస్తూ ప్రకృతిని నాశనం చేస్తున్నారు. కళ్లెదుటే ఇంత జరుగుతున్నా భూగర్భ శాఖ అధికారులు మాత్రం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. తుంగభద్ర నదికి ఇరువైపులా విజయనగరం జిల్లా, బళ్లారి జిల్లాలో పగలు, రాత్రి అక్రమంగా ఇసుక మళ్లిస్తూనే ఉన్నారు. తెల్లవారుజామున తెప్పలు నదులలోకి తీసుకెళ్లి నదిలో ఉన్న ఇసుకను తెప్పల్లో వేసుకుని బయటకు మళ్లించి అక్కడి నుండి టిప్పర్ల ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నారు. హడగలి, హగరి బొమ్మనహళ్లి, మరెమ్మనహళ్లి, గంగావతి సమీపంలోని ముష్టూరు, ధనాపురం, మరలి, చిక్కజంతగల్లు, సన్నాపురం, ఇటిగి, మన్నూరు, నూగూరు, రుద్రపద తదితర గ్రామాల్లో ఇసుక రవాణా చేపడుతున్నారు. పలు చోట్ల ప్రభుత్వం ఇసుక కేంద్రాలు ఏర్పాటు చేసినా అక్కడ కొనుగోలు చేయకుండా అక్రమంగా తరలించే వారి వద్దకు వెళ్లి ఇసుకను తక్కువ రేట్లకు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా భూగర్భశాఖ అధికారులు అప్రమత్తమై అక్రమంగా తరలిస్తున్న ఇసుక ప్రాంతాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



లారీలో రవాణా చేస్తున్న ఇసుక

వైభవంగా కపిల దొడ్డయ్య రథోత్సవం

రాయచూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నగర సమీపం యరమరస్ క్యాంప్ వద్ద గల ఏగనూరు కపిలదొడ్డయ్య రథోత్సవం గురువారం రాత్రి అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఏటా మాఘ శుద్ధ నవమిన రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. చుట్టుపక్కల గ్రామాల భక్తులు తరలివచ్చారు.



రథాన్ని లాగుతున్న భక్తులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1617.06	1,588.39
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10.137	442
నీటి నిల్వ (టీఎంసీలు)	53.47	9.74

పత్తా లేని ప్రభుత్వ గోశాల..!

● పట్టుబడిన పశువులను ఎక్కడ ఉంచాలి? ● తల పట్టుకుంటున్న పోలీసులు ● గోశాల నిర్మిస్తామన్న హామీ ఏమైందో..?

బళ్లారి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కబేళాలకు తరలిస్తూ పట్టుబడిన పశువులను ఎక్కడ ఉంచాలో పోలీసులకు అంతుబట్టడం లేదు. ఇటీవల ప్రభుత్వం జిల్లాకో గోశాల నిర్మిస్తామని సభలో ప్రకటించింది. కానీ జిల్లాలో ఎటువంటి కార్యాచరణ ప్రారంభం కాలేదు. పశువుల రక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు లేకపోవడంతో పోలీసులు కేసులు పెట్టి పశువులను వదిలేస్తున్నారు. ఇటీవల శీతాకాల శాసనసభ సమావేశాల్లో విధానసభలో గోరక్షణ అంశంపై బీజేపీ ఎమ్మెల్సీ వైఎం సతీష్ ప్రశ్నించారు. గోవులు కబేళాలకు తరలించకుండా రక్షించడం మంచిదేనని, కానీ తరలిస్తూ పట్టుబడిన గోవులను ఎక్కడ ఉంచాలనేది పోలీసులకు తలనొప్పిగా మారిందన్నారు. పోలీసుల రికార్డుల ప్రకారం గో రవాణా చేస్తూ పట్టుబడిన కేసులు రాష్ట్ర వ్యాప్తంగా 903కు పైగా ఉన్నాయన్నారు. పశువర్ధ శాఖ రికార్డుల ప్రకారం బళ్లారిలో ఎక్కడా ప్రభుత్వ గోశాల లేదు, ఈ ప్రాంతంలో నిత్యం గుల్బర్గా, యాదగిరి, బళ్లారి, బెంగళూరు తదితర ఏరియాకు పశువులను తరలిస్తూ పట్టుబడతా యన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలో గోశాలలు ఏర్పాటు చేశాయి కానీ బళ్లారి జిల్లాలో ఏర్పాటు చేయలేదు. ఇక ఉమ్మడి జిల్లాగా ఉన్నపుడు మాత్రం గోశాల కూడ్లిగిలో ఉండేది. అది ఇప్పుడు విజయనగర జిల్లాకు మారిపోయింది. కంప్లి వద్ద గోశాల ఏర్పాటుకు 25.26 ఎకరాల్లో నిర్మించాలని ప్రణాళిక చేశారు. కానీ ఇంత వరకూ వాటికి స్థితిగతీ లేదు, రాజకీయ పార్టీ నాయకులు గోరక్షణ, మూగజీవుల రక్షణ అంటారే కానీ వాటి రక్షణకు అవసరం అయిన స్థలం ఏర్పాటు చేయలేదని ఇప్పటి కైనా ప్రభుత్వ ముందుకు వచ్చి ప్రభుత్వ గోశాల నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



కబేళాకు తరలిస్తుండగా పట్టుబడిన పశువులు (ఫైల్)

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ



అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని సత్యనారాయణ పేటలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. స్వామి వారి విగ్రహాలకు హోమాలు చేసి ప్రాణప్రతిష్ఠ చేశారు. పుష్పాలతో అలంకరించారు. ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మ తీర్థ, ఆదమారు మఠం పీఠాధిపతి విశ్వప్రియతీర్థలు పాల్గొని భక్తులకు మంత్రాక్షితలు అందించి ఆశీర్వాదించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, ప్రముఖులు ప్రతాప్‌రెడ్డి, కార్పొరేటర్ అశోక్, ఆలయ ధర్మకర్త గురురాజు, సారంగం కుటుంబీకులు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు



అభిషేకం నిర్వహిస్తున్న జడే సిద్ధేశ్వరస్వామి

కంప్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కురుగోడు తాలుకా పరిధిలోని ముష్టిగట్టి గ్రామానికి వెళ్లే కొండలో వెలిసిన శ్రీశైల మల్లికార్జున స్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏ వీరాపురం జడ సిద్ధలింగేశ్వరస్వామి చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి జలాభిషేకం, అమృతాభిషేకం బిల్వార్చన, పుష్పాభిషేకం, మహా మంగళహారతి మరి ఇతర పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా జడె సిద్ధేశ్వర స్వాములు మాట్లాడుతూ కొండల్లో వెలిసిన మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలతో పాటు మొక్కులు సమర్పించుకున్నట్లయితే తమ కోరికలతో పాటు మనసు నెమ్మది, ప్రశాంతమైన జీవితం కొనసాగిస్తామని తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భీమన గౌడ మాట్లాడుతూ ఏటా ఆలయంలో శివరాత్రికి ముందు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. పూజల్లో ముష్టిగట్టితో పాటు కురుగోడు తదితర ప్రాంతాల భక్తాదులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ కానుక



ఉపాధ్యాయులకు టీవీ అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ రమణ

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పిల్లల అభ్యాసంలో స్మార్ట్ టీవీ చాలా సహాయకారిగా ఉంటుందని కెనరాబ్యాంక్ హలకుంది బ్రాంచ్ మేనేజర్ రమణ అన్నారు. శుక్రవారం తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలకు బ్యాంకు నుంచి రూ.25వేల 43అంగుళాల టీవీని ఆయన కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేక మేధస్సు ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు వారిని సరైన దారిలో విజయం సాధించేలా చూడాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిచెళ్లగుర్కి అధ్యక్షత వహించి నేటి శాస్త్ర, సాంకేతిక, శాస్త్రీయ దృక్పథానికి స్మార్ట్ టీవీలు ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. ఈసందర్భంలో మాజీ గ్రామపంచాయతీ అధ్యక్షురాలు మించేరి రామాంజిని, ఉపాధ్యాయులు చన్నమ్మ, సుమతి, వైశాలి, శ్వేత, ఉమ్మేహాని, గురుప్రసాద్, విజయ మంత్రగి, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీకే శివకుమార్

కంప్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీజేపీ సీనియర్ నాయకులు సీఆర్ హనుమంతు, సిద్దప్ప కాంగ్రెస్‌లోకి చేరారు. శుక్రవారం బెంగళూరులో ఎమ్మెల్యే గణేష్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో తమ ప్రభుత్వం పథకాలు మెచ్చి కంప్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే గణేష్ చేపడుతున్న అభివృద్ధి పనులు దృష్టిలో వుంచుకుని పార్టీలో చేరారన్నారు. ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ తమ పార్టీను తమను నమ్మి పార్టీలో చేరినందుకు హర్షణీయమన్నారు. షణ్ముఖప్ప, కౌన్సిలర్ చాంద్ బాషా, హబీబుర్ రెహమాన్, గిరీష్, విజయ్ కుమార్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జోడు రథోత్సవాలు

సిరుగుప్ప, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అంగరంగ వైభవంగా శనేశ్వర నిర్మానంద స్వాముల జోడు రథోత్సవం శుక్రవారం జరిగింది. సిరుగుప్ప తాలుకాలోని బేలూరు, బలకుంది గ్రామాల మధ్య హగరి నదిలో వెలసిన శనేశ్వర నిర్మానంద స్వాముల జోడు రథోత్సవాన్ని భక్తులు ఎంతో వైభవంగా నిర్వహించారు. భక్తులు పూలు, పండ్లు విసిరి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు నాగేంద్రస్వామి ఆధ్వర్యంలో స్వాముల వారికి ప్రత్యేక పూజలు చేసి రథోత్సవంలో పాల్గొన్నారు. వేలాది మంది రథోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పీఎల్‌డీ అధ్యక్షుడిగా చొక్క బసన్నగౌడ

సిరుగుప్ప, ఫిబ్రవరి 7(ఆంధ్ర జ్యోతి): పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షులుగా చొక్క బసన్నగౌడ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం పట్టణంలో పీఎల్‌డీ బ్యాంకులో అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో అధ్యక్షుడిగా చొక్క బసవన్న గౌడ, ఉపాధ్యక్షుడిగా చంద్రగౌడ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, తహసీల్దార్ విశ్వనాథ్ ప్రకటించారు. డైరెక్టర్లు, బ్యాంకు సిబ్బంది వారిని సన్మానించారు.



బసన్నగౌడను సన్మానిస్తున్న తహసీల్దార్ విశ్వనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీసీ మహమ్మద్ జుబేర్

మహనీయుల జయంతిని ఘనంగా జరుపుకుందాం

● అధికారులతో సమావేశంలో ఏడీసీ జుబేర్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాయంత్రాంగం, సంత్‌సేవాలాల్, ఛత్రపతి శివాజీ మహారాజ్, సంతకవి సర్వజ్ఞ వంటి మహానుభావుల జయంతిని అర్థవంతంగా జరుపుకునేందుకు సిద్ధం కావాలని అదనపు జిల్లాకలెక్టర్ మహమ్మద్ జుబేర్ అన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయంలో జరిగిన మహనీయుల జయంతి ముందస్తు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 15న సంత్ సేవాలాల్ జయంతి, 19న ఛత్రపతి శివాజీ , 20న సర్వజ్ఞ జయంతిని నగరంలోని జోలదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో అర్థవంతంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. సంత్‌సేవాలాల్, ఛత్రపతి శివాజీ, సంతకవి సర్వజ్ఞ జయంతి కార్యక్రమాల్లో భాగంగా భారీ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. రోడ్డు ట్రాఫిక్ సక్రమంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జయంతి వేడుకల్లో ఆహ్వాన పత్రికలు, ప్రత్యేక ఉపన్యాసాలు, ప్రతిజ్ఞాపఠనం వంటి ప్రతిదాన్ని సరిగ్గా నిర్వహించాలి, అదేవిధంగా ఊరేగింపు సమయంలో వేదిక,తాగునీరు, పరిశుభ్రత,పోలీసుల ఉనికికి సరైన ఏర్పాట్లు ఉండేలా చూడాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. నేటి తరానికి గొప్ప వ్యక్తుల భావజాలాలను పరిచయం చేయాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో నైపుణ్యం కలిగిన లెక్చరర్లతో ప్రత్యేక ఉపన్యాసాలు ఏర్పాటుచేయాలన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులు, కళాకారులను సత్కరించాలన్నరు. కార్యక్రమాలకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా చూడాలన్నారు. ఈసందర్భంలో కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజుతో పాటు వివిధ జిల్లాస్థాయి శాఖల అధికారులు, సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాలింతల మరణాలపై దర్యాప్తు జరపాలి

● డ్రగ్ యాక్షన్ ఫోరం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గోపాల్ దబాడే

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరుస బాలింతల మరణాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని డ్రగ్ యాక్షన్ ఫోరం కర్ణాటక యూనివర్సల్ హెల్త్ మూవ్‌మెంట్ కర్ణాటకకు చెందిన డాక్టర్ గోపాల్ దబాడే డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బాలింతల మరణానికి కారణమైన సెలైన్ ద్రావణం విషపూరితమైనది. దీనివల్ల గర్భిణీ స్త్రీలు మరణిస్తున్నారన్నారు. దీనిని పశ్చిమ బెంగాల్ కంపెనీ సరఫరా చేస్తుంది. నాణ్యత లేని మందులను సరఫరా చేసిన అదే కంపెనీ నుంచి ప్రభుత్వం మళ్లీ ఎందుకు కొనుగోలు చేసిందన్నారు. ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. మృతి చెందిన గర్భిణీలకు పోస్టుమార్టం చేయకుండా తప్పుడు నివేదికలు ఇచ్చారన్నారు. సెలెన్ బాటిళ్ల సరఫరాను తనిఖీ చేయాలన్నారు. బయటి రాష్ట్రాల నుంచి సెలెన్ సరఫరాను నిలిపివేయాలన్నారు. ఆరోగ్యమంత్రి దినేష్ గుండురావు బయటి నుంచి మందులు దిగుమతి చేసుకోకూడదని ప్రకటిస్తున్నా ఆచరణలోకి రావడం లేదన్నారు. సురక్షితమైన, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ, ఫిర్యాదులను పరిష్కరించే హక్కు ఉందని ఆయన అన్నారు. అదేవిధంగా కర్ణాటకలోకూడా ఆరోగ్య హక్కు చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఊరేగింపు ఫిబ్రవరి 3న బీదర్‌నుండి ప్రారంభమై నేడు బళ్లారికి చేరుకుంది. తరువాత రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పర్యటించి 14న బెంగళూరులో ముగుస్తుందన్నారు. బళ్లారిలోని అంబేడ్కర్ సంఘం కార్యాలయం నుంచి డీసీ కార్యాలయం వరకు ఊరేగింపు నిర్వహించి, జిల్లా యంత్రాంగం ద్వారా వినతిపత్రాన్ని సీఎం, ఆరోగ్య మంత్రికి పంపుతామని ఆయన తెలిపారు. సమావేశంలో సంస్థప్రతినిధులు మహమ్మద్ నూర్, పర్వీన్‌బాను, చంద్రకుమారి, లక్ష్మీనరసింహ, శేఖర్‌బాబు, వీణ పాల్గొన్నారు.

జాతీయ బ్యాంక్ ఏర్పాటుకు డిమాండ్



మాట్లాడుతున్న ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఒక రాష్ట్రం, ఒక గ్రామీణ బ్యాంకు ఏర్పాటుకు ఈనెలాఖరు నాటికి పూర్తవుతుంది. దీంతో మొత్తం గ్రామీణ బ్యాంకుల సంఖ్య 12కి చేరుకుంది. అవి ఇప్పుడు అవసరం లేదు. గ్రామాల్లో జాతీయ జాతీయ గ్రామీణ బ్యాంకును స్థాపించాల్సిన అవసరం ఉందని అఖిల భారత గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ సంఘం 15వ వార్షిక సమావేశం శనివారం నుంచి బళ్లారి కమ్మభవనంలో రెండు రోజుల పాటు జరగనుందన్నారు. చివరిసారిగా 2021లో గౌహతిలో జరిగింది. ఇది గతంలో 1989లో కర్ణాటకలో జరిగిందని, మరోసారి ఇక్కడ జరుగుతోందన్నారు. వెయ్యిమందికి పైగా పాల్గొంటారన్నారు. గ్రామీణ బ్యాంక్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయ్యిందని, దేశంలో మొత్తం 43గ్రామీణ బ్యాంకులు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో రెండు గ్రామీణ బ్యాంకులు ఉన్నాయని, వాటిని విలీనం చేసి కర్ణాటక గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేస్తాయని అన్నారు. గ్రామీణ బ్యాంకుల్లో సిబ్బంది కొరత ఉందని, 400 మిలియన్ల మంది కష్టమర్లున్నారన్నారు. దీంతో సేవలు అందడం లేదన్నారు. సుమారు 25వేల సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 15వేల మంది సిబ్బంది తాత్కాలికంగా పనిచేస్తున్నారన్నారు. వాణిజ్య బ్యాంకుల సిబ్బందికి అందించే సౌకర్యాలు కల్పించాలని... పదవీ విరమణ పెన్షన్‌ను సక్రమంగా అమలు చేయాలన్నారు. గ్రామీణ బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులు సంఘం ప్రధాన కార్యదర్శి గణపతి హెగ్డే మాట్లాడారు. దేశంలో 22,000 గ్రామీణ బ్యాంకుల శాఖల ఉన్నాయి. ఎస్‌బీఐ తరువాత తమ బ్యాంకు అతిపెద్దదని, దీని వ్యాపారం రూ. 11,29,000 కోట్లని అన్నారు. అధ్యక్షుడు సి.రాజీవన్ మాట్లాడుతూ , అసోసియేషన్ పోరాటం ,బ్యాంక్ అందించే సౌకర్యాల గురించి తెలియజేశారు. విలేకరుల సమావేశంలో అసోసియేషన్‌కు చెందిన ప్రశాంత్‌చౌదరి, మీనా, పన్నరాజ్, కేకోటేశ్వరరావు, టీజీ. విఠల్ నాగభూషణ్‌రావు, బన్నిగోల్ పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) నగరంలోని కౌల్‌బజార్ పెద్దమ్మతల్లి దేవాలయంలో ఆలయ వార్షికోత్సవ పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ అర్చన, అభిషేక పూజలు చేశారు. సామూహిక లలిత శాస్త్ర నామమం పఠించారు. పుష్పాలతో అలంకరించి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, అంజనేయులు, రాజీవ్‌గాంధీ, చెన్నప్ప, పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

హోసూరు జోన్

బస్సు సర్వీస్ ప్రారంభం



కణిమంగళం బస్సును ప్రారంభిస్తున్న జిల్లా కార్మికసంఘం కార్యదర్శి వై.ప్రకాశ్

హోసూరు ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): హోసూరు పంచాయతీ యూనియన్‌లో హోసూరు నుంచి జీమంగలం, కణిమంగళం మీదుగా బాగలూరుకు కొత్త బస్సు నడపాలన్నది ప్రజల చిరకాల కోరిక. శుక్రవారం జిల్లా కార్యదర్శి వై.ప్రకాశ్ హోసూరు నుంచి వెంకటాపురం మీదుగా బాగలూరు వరకు కణిమంగలం గ్రామానికి వెళ్లే 2 సీ నంబరు బస్సును ప్రారంభించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి సంఘం కార్యవర్గ సభ్యులు నాగరాజు, బాబు, వీరభద్రప్ప, రాము, మునిరాజు, రమేశ్, గోపాల్, శేఖర్, లోకేశ్‌రెడ్డి, త్యాగరాజు, శివశంకర్, మునిరాజు, రవి, పంచాయతీ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు మునిరాజు, కణిమంగళం శాఖ కార్యదర్శి సీనప్ప, చంద్రప్ప, బాలమురళీ, ప్రభుత్వ అధికారులు , ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై డ్రైవర్లకు అవగాహన

బళ్లారిరూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : సండూరు తాలుకాలో స్మైల్ ఫైన్స్ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. శుక్రవారం బళ్లారి ఆర్టీవో శ్రీనివాస్ గిరి నేతృత్వంలో అంతర్జాతీయ 36వ రోడ్డు భద్రతపై డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్టీవో శ్రీనివాస్ గిరి మాట్లాడుతూ డ్రైవర్లు వాహనం నడిపే సమయంలో రోడ్డు భద్రత సీట్‌బెల్టు, రోడ్డు మలుపులపై పలు ట్రాఫిక్ రూల్స్ గమనించాలని వేగం సరైంది కాదన్నారు. డ్రైవర్లకు ప్రమాదాలపై పలు సూచనలు, రోడ్డు భద్రతపై విషయాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ రఫీ పాల్గొన్నారు.



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ శ్రీనివాస్ గిరి

'ప్రజలతో ముఖ్యమంత్రి'ని విజయవంతం చేయాలి

● అధికారులతో సమావేశంలో కలెక్టర్ దినేశ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి) ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రజలతో ముఖ్యమంత్రి కార్యక్రమం నాలుగురోజుల పాటు జరగనుంది. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశంలో ఫేజ్ 3 ప్రాజెక్టు విస్తరణ, పురోగతిపై అధ్యయన సమావేశం జరిగింది. కలెక్టర్ ఎస్. దినేశ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈనెల 12, 13, 18, 19 తేదీలలో ప్రజలతో ముఖ్యమంత్రి కార్యక్రమం జరగనుంది. తమిళనాడు ప్రభుత్వం తన ప్రజలకు బాధ్యతాయుతంగా వివిధ సేవలను అందిస్తోంది, అనేక ప్రభుత్వ సేవలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించకుండా వారి ఇళ్ల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి వివిధ సేవలను విజయవంతంగా అమలు చేస్తున్నారు. అణగారిన ప్రజలు, సేవా ధృవీకరణ పత్రాలపై తగినంత అవగాహన లేని వారిని ఆదుకునేందుకు, ప్రభుత్వ సేవలను వారి స్థలానికి, నిర్ణీత గడువులోగా అందించేందుకు వీలుగా మొత్తం 139 శిబిరాలు, పట్టణ ప్రాంతాల్లో 43 శిబిరాలు, కృష్ణా జిల్లాలో రెండు దశల్లో 96 శిబిరాలు పూర్తయ్యాయి. తమిళనాడు ముఖ్యమంత్రి ఇప్పుడు ప్రజలతో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని మూడో దశకు విస్తరించాలని, కృష్ణగిరి జిల్లాలోని ఆది ద్రావిడ మరియు గిరిజనులు అధిక సంఖ్యల్లో పంచాయతీలల్లో నివసిస్తున్నారని తెలిపారు. పథకం యొక్క ప్రధాన లక్ష్యాలు, దివ్యాంగులు, వృద్ధులకు ప్రభుత్వ సేవలను అందించడం, ముఖ్యమంత్రితో ప్రజలతో కార్యక్రమం క్రింద శాఖల ద్వారా అందించబడిన సేవలు వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. గ్రామీణాభివృద్ధి పథకం, కొత్త విద్యుత్ కనెక్షన్‌లు, అదనపు విద్యుత్ ఛార్జీలు, నీటి కనెక్షన్, నిర్మాణ డ్రాయింగ్ ఆమోదం, భూ వినియోగ మార్పుకు ఆమోదం, హౌసింగ్ కోసం తమిళనాడు అర్బన్ హాబిటాట్ డెవలప్‌మెంట్ బోర్డు అప్లికేషన్, హౌసింగ్ బోర్డు జారీ చేసిన కేటాయింపుల కోసం సేల్ ఇలా ఎన్నో వివరాలను తెలుసుకోవచ్చని తెలిపారు.

వెట్టిచాకిరీ నిర్మూలనపై అవగాహన

జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశంలో కార్మిక సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి శాఖ తరఫున వెట్టిచాకిరీ నియంత్రణపై కలెక్టర్ ఎస్.దినేశ్‌కుమార్ నేతృత్వంలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కార్మికుల నిర్మూలన సందర్భంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాండెడ్ లేబర్ సిస్టమ్ ఫిబ్రవరి 9 నుంచి అమలులోకి వచ్చే 1976 బంధిత కార్మిక చట్టం ద్వారా రద్దు చేయబడింది, దీనిని అనుసరించి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 9 బంధిత కార్మికుల నిర్మూలన దినంగా పాటిస్తారు, ఈ చట్టం ప్రకారం బలవంతపు శ్రమ అనేది ఒక రకమైన బానిసత్వం అనేది ముందుగా చెల్లించిన రుణాల ద్వారా లేదా ఇతర కులం మరియు సామాజిక నియంత్రణ ద్వారా ఒక వ్యక్తిని బలవంతంగా పనిలోకి పెట్టడం మరియు కార్మికుల హక్కుల మరియు స్వేచ్ఛను హరించడం, బాండెడ్ లేబర్ చట్టం అటువంటి బాండెడ్ లేబర్‌ను ఆచరించే యజమానులకు మూడేళ్ల జైలుశిక్ష మరియు రూ.2000 వరకు జరిమానం విధించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంల్లో జిల్లా పోలీసు ఇన్‌స్పెక్టర్ పి.తంగదురై, రెవిన్యూ అధికారి ఎ.సాధనకురళ్, జిల్లా కలెక్టర్ ఇంటర్న్యూ కుమరన్, కృష్ణగిరి రెవిన్యూ కమిషనర్ షాజహాన్, తదితర అధికారులు ప్రతిజ్ఞ చేశారు. బాండెడ్ కార్మికుల నిర్మూలన చేయాలని తెలిపారు.

12 నుంచి 'ధర్మనిధి ఉపన్యాసాలు'

పెరంబూర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా తీరం సమీపంలోని మద్రాసు విశ్వవిద్యాలయంలో ఈ నెల 12,13 తేదీల్లో 'ధర్మనిధి ఉపన్యాసాలు' జరుగనున్నాయి. ఈ మేరకు మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు ప్రకటన విడుదల చేశారు. మెరీనా తీరంలోని రజతోత్సవ ప్రాంగణంలో రెండు రోజులు జరుగనున్న కార్యక్రమంలో, 'రాజుపాళెం తెలుగు కవుల సాహిత్యం' అనే అంశంపై ఆర్కాటు ప్రకాశరావు, 'తెలుగు, సంస్కృత భాషలు-వైరుధ్యం' అంశంపై ఆచార్య జీవీఎస్ఆర్ కృష్ణమూర్తి, 'జర్నలిజం-మహిళ: చర్చనీయాంశాలు' అంశంపై ఎన్నార్ చందూర్ స్మారక ధర్మనిధి ఉపన్యాసాలు జరుగనున్నాయి.